సాక్షి
శ్రీకాకుళం
శనివారం : 13 : జులై : 2024



శివారుకు సాగునీరిస్తాం..

శివారుకు సాగునీరు అందిస్తామని బీఆర్ ఆర్ వంశధార ప్రాజెక్టు ఎస్ఈ రాంబాబు తెలిపారు. ఆయన సాక్షితో మాట్లాడారు. - 8లో



బ్యాడ్మింటన్ టోర్నీకి సై

నేటి నుంచి జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ జరగనుంది. జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారు. - 8లో

సీసీ టీవీ సర్వీసింగ్‌లో ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఎచ్చెర్లలో ఈ నెల 25వ తేదీ నుంచి ఉమ్మడి శ్రీకాకుళం గ్రామీణ ప్రాంత యువకుల కోసం సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్‌లో 13 రోజుల పాటు ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించనున్నామని సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి భోజన సదుపాయాలు కల్పించనున్నామని అన్నారు. వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఫోన్ 7993340407, 9553410809 నంబర్లను సంప్రదించాలని కోరారు.

న్యూస్‌రీల్

'రెండో శనివారం సెలవు అమలు చేయాల్సిందే'

శ్రీకాకుళం: ప్రతి నెలా రెండో శనివారం సెలవును అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలలు, పాఠశాలలు అమలు చేసేలా జిల్లా ఆర్ఐఓ, విద్యాశాఖాధికారులు దృష్టి నిలిపి చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు జారీ చేసినట్లు ఆ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సెలవు అమలులో ఏ యాజమాన్యానికి ఎలాంటి మినహాయింపులు ఉండబోవని, పక్కాగా అమలు జరిగేలా సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక పరిశీలన బృందాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇప్పటికే ఈ సెలవు పక్కాగా అమలు కోరుతూ తమ కమిషన్‌కు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, బాలల హక్కుల సంఘాల నుంచి వినతులు, సూచనలు లేఖల రూపంలో అందుతున్నాయని తెలిపారు. కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో వీటిని పరిశీలించి చర్యలు చేపట్టేలా సంబంధిత జిల్లాల ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, నేరుగా తమకు ఫిర్యాదులు పంపించవచ్చునని సీతారాం తెలియజేశారు.

నేటితో ముగియనున్న పాలీసెట్ రెండో విడత కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన పాలీసెట్ రెండో విడత కౌన్సెలింగ్‌లో భాగంగా.. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ధ్రువీకరణ పత్రాల పరిశీలన కొనసాగుతోంది. సహాయ కేంద్రంలో గురువారం ప్రారంభమైన ఈ పరిశీలన శనివారంతో ముగియనుంది. పరిశీలనకు శుక్రవారం 40 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం రెండు రోజుల్లో 70 మంది హాజరయ్యారు. మరో పక్క మొదటి విడత సీట్లు లభించిన విద్యార్థులకు సైతం కళాశాలలు, బ్రాంచ్‌లు ఆప్షన్లు మార్చుకునే వెసులుబాటు ఉంది. 14వ తేదీలోపు ఆప్షన్లు ఎంచుకోవాల్సి ఉంటుంది. 16న సీట్ల అలాట్ మెంట్, 20లోపు కళాశాలలకు అటాచ్‌మెంట్ ఆర్డర్లు అందజేయాల్సి ఉంటుంది. కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రిన్సిపాల్ దామోదర్‌రావు, అధ్యాపకులు మురళీకృష్ణ పర్యవేక్షిస్తున్నారు.

15న సహారా బాధితుల చలో కలెక్టరేట్



పలాసలో మాట్లాడుతున్న ఏజెంట్లు, ఖాతాదారులు

కాశీబుగ్గ: సహారా ఇండియా కస్టమర్లకు, ఏజెంట్లకు వెంటనే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపడుతున్నట్లు సంబంధిత సంఘం అధ్యక్షులు బైపల్లి సత్యరాజు, సూర్యారావు, రామ్ చరణ్, విశ్వేశ్వరరావు, ఎస్ఎల్ గాంధీ, పీవీ రావు, ఎన్.రూప్‌సుందర్ తదితరులు తెలిపారు. పలాసలో వారంతా మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి బాధితులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. సహారా ఇండియా బాధితులంతా అధిక సంఖ్యలో ఉన్నారని, సంస్థలో పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయని సహారా కంపెనీ ఆశ చూపడంతో లక్షల మంది కోట్లాది రూపాయలను సంస్థలో పొదుపు చేశారని, గడువు పూర్తయినా చెల్లించకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఖాతాదారులకు డిపాజిట్ డబ్బును వెంటనే చెల్లించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే కలెక్టరేట్ ధర్నాలో జిల్లాలోని ఖాతాదారులు ఏజెంట్లు పాల్గొనాలని కోరారు.

జిల్లా హాకీ అసోసియేషన్ ఎన్నికలు రేపు



శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా హాకీ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఈనెల 14వ తేదీన జరగనున్నట్లు ఏపీ హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.హర్షవర్ధన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం నగరంలోని తిలక్‌నగర్‌కాలనీలో ఉన్న యూటీఎఫ్ భవన్ కార్యాలయంలో ఈ ఎన్నికల ప్రక్రియ జరగనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి సంఘ ప్రతినిధులు, హాకీ క్రీడాభిమానులు, సీనియర్ క్రీడాకారులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.











● ఆటోవాలా.. ఇలా అయితే ఎలా..?

ఆటోవాలాల తీరు మారడం లేదు. పరిమితికి మించి పిల్లలను బండిలో ఎక్కించుకోకూడదని నిబంధనలు చెబుతున్నా. ప్రతి నిత్యం ఇలా విద్యార్థులను ఆటోలో కుక్కేస్తూ బడులకు తీసుకెళ్తున్నారు. ఇలాంటి ప్రయాణాల వల్ల విద్యా ర్థు లు ప్రమాదాల బారిన పడుతున్నారని. తల్లిదండ్రులు మేలుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

పేదింటి పునాదులు కూల్చివేత

- ఇచ్ఛాపురం మండలం తులసిగాంలో ఘటన
- నోటీసులు ఇవ్వకుండా జగనన్న ఇళ్ల పునాదులు ధ్వంసం
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు



పునాదులు ధ్వంసం చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: జగనన్న ఇళ్లపై టీడీపీ నాయకులకు కన్నుకుట్టింది. అనుకున్నదే తడవుగా లక్షల రూపాయలు అప్పులు చేసి నిర్మించిన ఇంటి పునాదులను ధ్వంసం చేయించి పైశాచిక ఆనందం పొందారు. వివరాల్లోకి వెళితే.. ఇచ్ఛాపురం మండలం తులసిగాం పంచాయతీ జగనన్న కాలనీలో తమకు ఇళ్లు కావాలంటూ అదే గ్రామ సచివాలయం పరిధిలో గల కొయ్య మోహిని, త్రివేణి బడియా, బాకి భవానీ, కొండ మోహిని, నందికి శ్రావణి, లండ చందరమ్మలు తులసిగాం గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి తహసీల్దార్ పి.మీనాదేవి 2023 డిసెంబర్ 30న ఇళ్లు మంజూరు చేసేందుకు గ్రామ సచివాలయం, మండల సర్వేయర్‌లకు నివేదిక కోరారు. మండల సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వే నంబర్ 279లో గల ప్రభుత్వ స్థలంలో ఇళ్లు కట్టుకునేందుకు లబ్ధిదారులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా లబ్ధిదారులు పునాదులు వేసుకున్నారు. దీంతో స్థానిక టీడీపీ నాయకులు అక్రమ కట్టడాలు అంటూ రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు.

సార్వత్రిక ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మరోమారు ఈ అంశం తెరపైకి వచ్చింది. గత నెల 25న ధర్మపురం ఉన్నత పాఠశాలలో స్టూడెంట్స్ కిట్స్ అందించేందుకు వచ్చిన స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ దృష్టికి స్థానిక టీడీపీ నాయకులు ఈ అంశాన్ని తీసుకెళ్లారు. దీంతో ఆయన స్వయంగా కట్టడాలను పరిశీలించి రెవెన్యూ సిబ్బందితో మాట్లాడారు. శుక్రవారం ఉదయం రెవెన్యూ అధికారి చూడామణిరెడ్డి, వీఆర్వో సాలిన కృష్ణ, మండల సర్వేయర్ తవిటినాయుడు ఆధ్వర్యంలో జేసీబీతో పునాదులను నేలమట్టం చేశారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ ప్రతినిధి ఇసురు తులసిరాం, బాధిత లబ్ధిదారులు సంఘటనా స్థలానికి చేరుకొని కూల్చివేతను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. లక్షల రూపాయలు అప్పులు చేసి పునాదులు వేశామని, ఇప్పుడు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎలా కూల్చేస్తారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా ఒత్తిడి ఉన్న కారణంగా పునాదులు తొలగించడం జరుగుతుందని, తమ విధులకు ఆటంకం కలిగించరాదంటూ రెవెన్యూ సిబ్బంది చెప్పడంతో బాధిత లబ్ధిదారులు లబోదిబోమంటూ వెనుదిరిగారు. ఈ అంశంపై స్థానిక తహసీల్దార్ ఎం.భాస్కర అప్పారావు వివరణ కోరగా... గతంలో పనిచేసిన తహసీల్దార్ ఇళ్లను మంజూరు చేయడం వాస్తవమేనని, సర్వే నంబర్ అదే అయినప్పటికీ లబ్ధిదారులకు పట్టాలు గానీ, పొజిషన్ ఆర్డర్ గానీ ఇవ్వకపోవడంతో పాటు గ్రామసచివాలయానికి దగ్గరలో పునాదులు ఉండటం మూలంగా భవిష్యత్‌లో సమావేశాలు, కార్యక్రమాలకు అడ్డుగా ఉంటుందన్న ఉద్దేశంతో పునాదులను తొలగించడం జరిగిందని అన్నారు. లబ్ధిదారులకు వారం రోజుల్లో మరో చోట ఇళ్ల స్థలాలను కేటాయించడం జరుగుతుందని, ఆందోళన చెందనవసరం లేదంటూ వివరణ ఇచ్చారు.

'శాస్త్రీయంగా నిధుల పంపిణీ'



మాట్లాడుతున్న ఆర్థిక సంఘ కార్యదర్శి రమణారెడ్డి

అరసవల్లి: స్థానిక సంస్థలకు నిధుల కేటాయింపు విషయంలో అంతా శాస్త్రీయబద్ధంగా జరగాలని ఐదో రాష్ట్ర ఆర్థిక సంఘ కార్యదర్శి ప్రొఫెసర్ కేవీ రమణారెడ్డి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, మున్సిపల్ కమిషనర్లతో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్థిక సంఘ కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ ఎం.ప్రసాదరావు, ప్రొఫెసర్ ఎంవీఎస్ పద్మారావు, కె.కృపారావులతో కలిసి నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన పలు అంశాలతో పాటు నిధుల కేటాయింపు, పంపిణీ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ఆర్థిక సంఘం వివరణాత్మక నిబంధనలను అమలు చేస్తుందని, దీంతో స్థానిక సంస్థలకు న్యాయబద్ధంగా సమాన నిష్పత్తిలో నిధుల పంపిణీ జరుగుతుందని వివరించారు. గ్రామ పంచాయతీలు, జిల్లా పరిషత్, మండల పరిషత్‌లు పన్ను వర్తింపు సమస్యలు, వ్యయ సమస్యలు, ప్రాథమిక అవసరాల లభ్యత, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల భాగస్వామ్యం, రశీదులు, ఖర్చులు తదితర వివరాలపై అధికారులు పూర్తి స్థాయి సమాచారాన్ని సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఈఓ వెంకట్‌రామన్ తదితరులు పాల్గొన్నారు.

'తాబేలు పిల్లలను సంరక్షించాలి'



బట్టిగళ్లూరులో సముద్రంలోకి తాబేళ్ల పిల్లలను విడిచిపెడుతున్న మత్స్యకారులు

సోంపేట: మత్స్యకారులు తాబేలు పిల్లలను సంరక్షించాలని ట్రీ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ కె.సోమేశ్వరరావు కోరారు. బట్టిగళ్లూరు సముద్రతీరంలో తాబేలు పిల్లల సంరక్షణ కేంద్రం నుంచి 92 సముద్ర తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి శుక్రవారం విడిచి పెట్టారు. అనంతరం బట్టిగళ్లూరు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో బట్టిగళ్లూరు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యసిబ్బంది పద్మావతి, అరుణ్‌కుమార్, సుందరరావు, ట్రీ ఫౌండేషన్ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి ఖాదీ కార్మికుల సమస్యలు

- రాష్ట్ర చేనేత జౌళి శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎం.సునీత



ఖాదీ చీరలను పరిశీలిస్తున్న చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ సునీత


పొందూరు: పొందూరు ఖాదీ రంగంలో వడుకు, నేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఖాదీ రంగానికి మేలు జరిగేలా చూస్తామని రాష్ట్ర చేనేత జౌళి శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎం.సునీత హామీనిచ్చారు. ఆమె శుక్రవారం పొందూరు ఏఎఫ్‌కేకే సంఘాన్ని సందర్శించి చేనేత కార్మికులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఏఎఫ్‌కేకే సంఘం ఆధ్వర్యంలో 800 మంది వడుకు, 50 మంది నేత కార్మిక కుటుంబాలు పనిచేస్తున్నాయని, వారికి తగిన ప్రోత్సాహకం అందకపోవడంతో కొత్తతరం ఈ పనిలో చేరడం లేదని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు గుంటుకు కామేశ్వర ప్రసాద్, దండా వెంకటరమణ తెలిపారు. దీనిపై స్పందించిన ప్రిన్సిపాల్ సెక్రటరీ సునీత మాట్లాడుతూ ఖాదీ రంగం అభివృద్ధికి తగిన సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. అనంతరం అంపోలు చేనేత సొసైటీ ప్రతినిధి కాశిన ప్రసాద్ మాట్లాడుతూ చేనేత సొసైటీలకు రావాల్సిన బకాయిలు ఇప్పించాలని, సబ్సిడీ బకాయిలు సకాలంలో విడుదలయ్యేలా చూడాలని కోరారు. పొందూరు మండలంలో ఏడాదిన్నరగా 3 చేనేత క్లస్టర్లు నడుస్తున్నా ఇప్పటి వరకు క్లస్టరు లబ్ధిదారులకు ప్రయోజనాలు అందలేదని పలువురు తెలిపారు. తక్షణమే లబ్ధిదారులకు పరికరాలు, ప్రయోజనాలు అందేలా చూడాలని చేనేత, జౌళి శాఖ ఏడీకి ఆమె ఆదేశించారు. అనంతరం ఖాదీ కార్మికుల సంక్షేమానికి ఏఎఫ్‌కేకే సంఘానికి ప్రిన్సిపాల్ సెక్రటరీ సునీత వ్యక్తిగతంగా రూ. లక్ష విరాళాన్ని అందించారు. అనంతరం వడుకు మహిళా కార్మికులతో ఏర్పాటు చేసిన వడుకు ప్రక్రియను పరిశీలించారు. ఆమెతో పాటు చేనేత, జౌళి శాఖ అడిషనల్ డైరెక్టర్ కె.శ్రీకాంత్, ఏడీ సీహెచ్ సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత



అరసవల్లి: జిల్లాలో పలు విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతు పనుల కారణంగా 28 సెక్షన్ల పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లుగా జిల్లా సర్కిల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలియజేశారు. టెక్కలి డివిజన్‌లో ఎల్ఎన్ పేట, గంగువాడ, పోలాకి, గొప్పిలి, నౌపడ, టెక్కలి, మదనాపురం, నిమ్మాడ, చల్లవానిపేట, నౌతల తదితర సబ్‌స్టేషన్లు, అలాగే పలాస డివిజన్‌లో కాశీబుగ్గ, పలాస, పూండి, హరిపురం, సోంపేట, బొరివంక, కంచిలి, ఇచ్ఛాపురం సబ్‌స్టేషన్లు, అలాగే శ్రీకాకుళం డివిజన్‌లో పార్వతీశంపేట, తొగరాం, అలికాం, కళింగపట్నం, ఏఎస్ఎన్ కాలనీ, అదపాక, మదనాపురం సబ్‌స్టేషన్లు, అలాగే పాలకొండ డివిజన్‌లో లుంబూరు, సీతంపేట, భామిని సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 8 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని ఆయన తెలియజేశారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.


డ్రై డే పాటిద్దాం: కలెక్టర్



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ) : జిల్లా ప్రజలంతా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వారంలో ఒక్కరోజు కచ్చితంగా డ్రై డే పాటిద్దామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. శుక్రవారం డ్రై డే సందర్భంగా కలెక్టర్ బంగ్లా రోడ్డు, తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, దోమలకు నిలయమయ్యే ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి చుట్టూరా రుబ్బురోళ్లు, సంపులు, టైర్లు, కూలర్లు, వాడి పడేసిన పాత్రలు, నీళ్ల ట్యాంకులు, కుండలు, డబ్బాలు, కొబ్బరి చిప్పల్లో నీరు నిల్వలేకుండా చూడాలన్నారు. కలెక్టర్‌తో పాటు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, డాక్టర్ వెంకటరావు, రమణమూర్తి ఉన్నారు.

రిమ్స్‌లో 'సీటు' పాట్లు

- రిమ్స్ వైద్యుల నిర్వాకంతో మంజూరు కాని వైద్యసీట్లు
- తరచూ విధులకు గైర్హాజవుతుండడంతో నిరాకరించిన ఎంసీఐ



శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ కళాశాలలో కొందరు వైద్యుల నిర్వాకం వల్ల పేద విద్యార్థులు నష్టపోతున్న దుస్థితి ఏర్పడింది. వైద్యుల హాజరు ఈ వైద్య కళాశాలకు మంజూరు కావాల్సిన అదనపు సీట్లకు ఎసరు పెట్టింది. వివరాల్లోకి వెళితే...
రిమ్స్ ఆస్పత్రి, వైద్య కళాశాలలో గత ప్రభుత్వం అనేక సౌకర్యాలను కల్పించటంతో 57కు పైగా పీజీ సీట్లు మంజూరయ్యాయి. అలాగే 50 వరకు ఎంబీబీఎస్ సీట్లు మంజూరయ్యాయి. దీంతో గత విద్యా సంవత్సరం నాటికి ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 150 చేరింది. మరో 50 సీట్లు పెరిగేందుకు కూడా తగిన సౌకర్యాలు ఉండటంతో అందుకోసం ప్రభుత్వ సూచనలు మేరకు రిమ్స్ యాజమాన్యం ఎంసీఐకి దరఖాస్తు చేసింది. కొద్ది నెలల కిందట పరిశీలనకు వచ్చిన ఎంసీఐ బృందం రిమ్స్‌లో కొందరు వైద్యులు విధులకు సక్రమంగా హాజరు కాకపోవటం, తరచూ సెలవులు పెట్టడంతో ఓపీ, శస్త్రచికిత్సలు, ఇన్ పేషెంట్ల సంఖ్య తక్కువగా ఉండడం గమనించింది. ఇదే విషయాన్ని తెలుపుతూ అన్ని సౌకర్యాలు అదనపు సీట్ల కేటాయింపునకు అనువుగా ఉన్నప్పటికీ వైద్యుల హాజరు, ఓపీ తక్కువగా ఉండటంతో అదనపు సీట్లు మంజూరు చేయలేమని తేల్చి చెబుతూ రిమ్స్ యాజమాన్యానికి ఎంసీఐ లేఖ పంపించింది. దీంతో రిమ్స్ అధికారులు ఓపీ, ఇన్ పేషెంట్లు, శస్త్రచికిత్సల సంఖ్యను పెంచేందుకు దృష్టి సారించారు. న్యూరాలజీ, కార్డియాలజీ, యూరాలజీ, ఆంకాలజీ వంటి నిపుణులు సైతం రిమ్స్‌లో ఉండటంతో వీరి సేవలను మరింతగా ఉపయోగించుకోవటం ద్వారా రోగుల సంఖ్యను పెంచాలని, వైద్యు లు సెలవులు పెట్టకుండా ఉండేలా నిబంధనలు తయారు చేసుకున్నారు. పనిచేసేందుకు ఇష్టం లేనివారు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోవాలని సూచనలు చేస్తున్నారు. మరోసారి పరిశీలనకు రావాలని ఎంసీఐకి ఉన్నతాకారుల ద్వారా రిమ్స్ అధికారులు లేఖను పంపించేందుకు సిద్ధం చేస్తున్నారు. వైద్యులు సక్రమంగా హాజరైతే అదనంగా 50 ఎంబీబీఎస్ సీట్లు మంజూరయ్యేందుకు అవకాశం ఉంది. మరో 50 మంది పేద విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులోకి వస్తుంది.

● తప్పని నిరీక్షణ



టెక్కలి స్టాక్ పాయింట్ వద్ద ఇసుక కావాలంటే రాత్రిపగలు పడిగాపులు కాయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. సాయంత్రం 6గంటలకే స్టాక్ పాయింట్ వద్ద అమ్మకాలు నిలిపివేస్తుండడంతో, ఇసుక అవసరమైన వాహనదారులు తమ వాహనాలను నడిరోడ్డుపై వదిలేసి ఇళ్లకు వెళ్తున్నారు. ఇదేం ఖర్మరా బాబూ అంటూ ఆయా వాహనదారులు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. - టెక్కలి

● రామావతారంలో..



జగన్నాథ రథ యాత్ర మహోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శుక్రవారం రామావతారంలో జగన్నాథస్వామి భక్తులకు దర్శనం ఇచ్చారు. స్థానిక వేంకటేశ్వరాలయం, పెద్దపేట రామాలయం, లకిమేర ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో రామావతారంలో ఉన్న జగన్నాథ స్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శనం చేసుకున్నారు. - నరసన్నపేట

క్లుప్తంగా

సంతబొమ్మాళిలో సోలార్ ప్లేట్లు ధ్వంసం



ధ్వంసమైన సోలార్ ప్లేట్లు

సంతబొమ్మాళి: సంతబొమ్మాళిలో మాజీ ఎంపీటీసీ కొన్న శ్రీరాములుకు చెందిన సోలార్ ప్లేట్లను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ధ్వంసం చేశారు. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పని చేశానని కక్ష గట్టి ఇలాంటి పని చేశారని, సోలార్ ప్లేట్లపై ఇనుప రాడ్లతో కొట్టి ధ్వంసం చేశారని బాధితుడు తెలిపారు. సుమారు రూ.లక్షయాభైవేల వరకు నష్టం జరిగిందని పేర్కొన్నారు. దీనిపై అధికారులు దర్యాప్తు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

కొత్తమ్మ తల్లి ఆలయంలో వేలం పాటలు ఖరారు

కోటబొమ్మాళి: కొత్తమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి ఫొటోలు, రక్షల అమ్మకానికి రెండేళ్ల కాల పరిమితికి గాను రూ.3,31,100, అలాగే భక్తులు సమర్పించిన చీరలు, జాకెట్లు పొందేందుకు రూ.82,500లు, కొబ్బరి ముక్కలు పొందేందుకు రూ.2,65,100కు దేవదాయ శాఖ అధికారులు వేలం పాటలు ఖరారు చేశారు. కోటబొమ్మాళికి చెందిన దేవాది అప్పలనాయుడు, ఉర్జాన కొండలరావు, ఉర్జాన రాములకు ఈ వేలం పాటలు ఖరారయ్యాయి. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.రాధాకృష్ణ, ఆలయ చైర్మన్ బోయిన మాధవి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


బోధకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ కోచింగ్‌కు సంబంధించి ఎస్‌జీటీ, ఇతర సబ్జెక్టులు బోధించేందుకు బోధకులు కావాలని బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు అనురాధ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హతలు ఉన్నవారు ఈనెల 18 వ తేదీన బీసీ స్టడీ సర్కిల్‌ను సంప్రదించాలని ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు 7382975679, 8332852106, 9295653484 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఆర్‌సెట్ సమీక్షలో పాల్గొన్న వీసీ

ఎచ్చెర్ల క్యాంపస్: పరిశోధన ప్రవేశాలకు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం మే మొదటి వారంలో ఆర్ సెట్ నిర్వహించింది. ఆర్‌సెట్ ప్రవేశాలకు సంబంధించి వర్చువల్‌గా రాష్ట్రస్థాయిలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ కె.ఆర్.రజిని హాజరయ్యారు. ఉన్నత విద్యామండలి ఆర్ సెట్ ప్రవేశాలు నిబంధనలు వివరించింది. ఈ నెల 24 నుంచి పీహెచ్‌డీ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు ఉన్నత విద్యా మండలి అధికారులు వివరించారు. వర్సిటీలో ఖాళీలు తెలియజేయాలని సూచించారు.

నేడు తోటపల్లి పాత ఆయకట్టుకు నీరు విడుదల



తోటపల్లి జలాశయం

వీరఘట్టం: తోటపల్లి జలాశయం పరిధిలో ఉన్న పాత ఆయకట్టుకు శనివారం సాగునీరు విడుదల చేస్తామని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. కుడి, ఎడమ కాలువల పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని 64వేల ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పూండిలో ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణం



భారీ క్రేన్ల సాయంతో పూండి వద్ద నిర్మిస్తున్న కాలినడక వంతెన

వజ్రపుకొత్తూరు: వాల్తేర్ డివిజన్‌లో చిట్టచివరి స్టేషన్ పూండిలో కాలినడక వంతెనను భారీ క్రేన్‌లతో నిర్మిస్తున్నారు. బ్రిటీష్ కాలం నాటి వంతెనకు కాలం చెల్లడంతో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పాత వంతెనకు సమాంతరంగా కొత్త వంతెన నిర్మాణం చేపట్టారు. పనులకు దాదాపు రూ.4.36 కోట్లు వెచ్చిస్తున్నారు. నెల రోజుల్లో అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. గురు, శుక్రవారాల్లో నౌపడ, శ్రీకాకుళం నుంచి ఐఓడబ్ల్యూలతో పాటు ఇంజినీర్ల బృందం రేయింబవళ్లు శ్రమించి 25000 వాట్స్ విద్యుత్ తీగల పైనుంచి ఎలాంటి అవాంతరం లేకుండా వంతెన పనులు చేపట్టారు.

శివారుకు సాగునీరు అందిస్తాం

- పిల్ల కాలువల పనులు ఉపాధి హామీలో పూర్తి చేస్తాం
- డిసెంబర్‌లో వంశధార ప్రాజెక్టు పనులు ప్రారంభం
- 'సాక్షి'తో జీఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు ఎస్ఈ జి.రాంబాబు



ఇంటర్వ్యూ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఖరీఫ్‌లో శివారు ఆయకట్టుకు కూడా సాగునీరు అందిస్తామని బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు ఎస్ఈ బి.రాంబాబు తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్‌లో వంశధార ప్రాజెక్టుతో పాటు హిరమండలం రిజర్వాయర్‌ను ప్రారంభించేందుకు, లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఉపాధి హామీ పనుల్లో ప్రతీ గ్రామంలో పిల్ల కాలువలు శుభ్రం చేయాలని సూచించారు. 'సాక్షి'తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు.

సాక్షి: వంశధార కాలువల్లో పూడిక బాగా పేరుకుపోయింది. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

ఎస్ఈ: పూడిక తీత పనులకు చర్యలు తీసుకున్నాం. 0 నుంచి 104 కిలోమీటర్లు గుర్రపు డెక్క తీసేందుకు చర్యలు చేపట్టాం. చిన్న చిన్న వంతెనలు, స్పిల్ వేలు మరమ్మతులు చేసేందుకు ఇప్పటికే రూ.50లక్షలు ఖర్చు చేశాం. ఇంకా మిగిలిన చిన్న చిన్న పనులను ఉపాధి హామీ పనుల ద్వారా చేస్తున్నాం.

సాక్షి: షట్టర్లు పాడై ఉన్నాయి. గతంలో జరిగిన షట్టర్ల అవినీతి కేసు పరిస్థితి ఏంటి?

ఎస్ఈ: గతంలో నరసన్నపేటలో చోటుచేసుకున్న షట్టర్ల అవినీతి కేసు కోర్టులో పెండింగ్‌లో ఉండడంతో కొత్తవి ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. దీనికి ప్రత్యామ్నాయంగా కొత్త షట్టర్లు ఏర్పాటుకి రూ.3.58కోట్లతో ప్రతిపాదనలు పంపించాం.

సాక్షి : ఆఫ్‌షోర్ పనుల పరిస్థితి ఏంటి?

ఎస్ఈ: ఆఫ్‌షోర్ పనులు గతంలో 25 శాతానికి పైగా పూర్తయ్యాయి. పాత కాంట్రాక్ట్‌ను రద్దు చేసి కొత్తగా అంచనాలు పెంచి 2023-2024లో రూ.299కోట్లతో అగ్రిమెంట్ జరిగింది. రేగులపాడు వద్ద ఆర్అండ్ఆర్ సమస్యను పరిష్కరిస్తున్నాం. ఇప్పటికే కాంక్రీట్ వర్క్ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. మట్టి పనులు అధిక శాతం జరిగాయి.

సాక్షి: సాగునీటి సమస్యలకు షట్టర్లు పాడవడం, కొత్తవి ఏర్పాటు చేయకపోవడమే ప్రధాన కారణమన్న విమర్శలు ఉన్నాయి?

ఎస్ఈ: షట్టర్ల కొనుగోళ్లలో జరిగిన అవినీతిపై 2009లో సీబీఐ కేసు నమోదు చేసింది. దీనిపై నేటికీ హైకోర్టులో విచారణ సాగుతోంది. విచారణ పెండింగ్‌లో ఉండడంతో కాలువలపై కొత్త షట్టర్లను ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో కొత్తగా షట్టర్లు ఏర్పాటు చేసుకోలేక, పాడైన వాటితోనే నెట్టుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. పలు సందర్భాల్లో ప్రజాప్రతినిధుల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లాం. ప్రభుత్వం చొరవ చూపితే సమస్య పరిష్కారమయ్యే అవకాశముంది. నాగావళి-వంశధార నదుల అనుసంధాన పనులు ఇప్పటివరకు 78 శాతం పూర్తయ్యాయి.

సాక్షి: హిరమండలం లిఫ్ట్ పనులు ఎంత వరకు వచ్చాయి?

ఎస్ఈ: వంశధార ఫేజ్-2, స్టేజ్-2 పనులు పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలోపే రైతులకు సాగునీరు ఇచ్చేందుకు రూపొందించిన లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ డ్రాయింగ్, డిజైన్లు పూర్తయ్యాయి. పంపులు, మోటార్లు ఇప్పటికే వచ్చేశాయి. పనులు మరింత వేగవంతం చేసి రబీ నాటికి పనులు పూర్తిచేస్తాం.

సాక్షి: స్టేజ్-2, ఫేజ్-2 పనుల పరిస్థితి ఏంటి?

ఎస్ఈ: ప్యాకేజీ-87, 88 పనులు దాదాపు పూర్తయ్యాయి. హిరమండలం రిజర్వాయర్ పనులు 93 శాతం జరిగాయి. ప్రస్తుతం స్పిల్‌వే పనులు జరుగుతున్నాయి. ఈ ఏడాదిలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. గొట్టా బ్యారేజీ వద్ద ఇసుక కొట్టుకుపోయి రాతి పరుపు (ఏప్రాన్) పాడైంది. దాన్ని పునర్నిర్మించేందుకు రూ. 15 కోట్లు అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపించాం. ఇంకా ఆమోదం రావాల్సి ఉంది. ఈ పనులు పూర్తిచేసి నదికి దిగువభాగంలో ఉండేందుకు రక్షణ కల్పిస్తాం.

సాక్షి: సాగు సాఫీగా చేసుకునేందుకు ఏం చేయాలనుకుంటున్నారు?

ఎస్ఈ: కాలువల్లో గుర్రపు డెక్క పెద్ద ఎత్తున పెరగడంతో సాగునీటి ప్రవాహానికి ఇబ్బందులు తలెత్తిన మాట వాస్తవమే. గుర్రపు డెక్క తొలగింపునకు రూ.50 లక్షల వరకు నిధులు ఖర్చుచేశాం. వంశధార, కుడి ఎడమ కాలువలకు మొత్తం 260 మంది లష్కర్లు కావాలి. సుమారు వందమంది వరకు పనిచేస్తున్నారు. సాగునీటి రెగ్యులేషన్ కోసం జిల్లా అవసరాల దృష్ట్యా 130 మంది కావాలని ప్రభుత్వాన్ని అడిగాం. ప్రభుత్వం అనుమతిస్తే అదనంగా లష్కర్లను నియమిస్తాం. లేకుంటే పాత వారినే మళ్లీ కొనసాగిస్తాం.

సాక్షి: ఆధునికీకరణ పనులు ఎప్పుడు చేపడతారు?

ఎస్ఈ: శిథిలావస్థలో ఉన్న వంశధార ఎడమ కాలువ పనులు చేపట్టకుంటే శివారు ప్రాంతాలకు ఆశించిన స్థాయిలో సాగునీరందించడం కష్టమే. దశలవారీగా చేపట్టాల్సిన పనులకు సంబంధించి రూ.1000 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వానికి నివేదిక పంపించాం. అందుకు డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డిపిఆర్) తయారుచేశాం. మొదటి దశలో అండర్ టన్నెల్స్, ఆఫ్ టేక్ స్లూయిజ్‌లు తక్షణం పునఃనిర్మించాల్సి ఉంది. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

సాక్షి: వానలు పడడం లేదు. ప్రత్యామ్నాయ చర్యలు ఏంటి?

ఎస్ఈ: వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. వర్షాలు కురిసిన వెంటనే ప్రతి సెంటుకి నీరిచ్చేందుకు చర్యలు చేపడతాం. ఏ ఒక్క రైతు దిగులు చెందాల్సిన అవసరం లేదు. శివారు వరకు నీరిచ్చే తీరుతాం.

'అపర్ణ అత్యంత ప్రతిభాశాలి'



అవధాన ప్రక్రియ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: అత్యంత ప్రతిభాశాలి అవధాని బులుసు అపర్ణ అని కోటబొమ్మాళికి చెందిన పండితులు సుసరాపు గణపతి శర్మ అన్నారు. స్థానిక అరసవల్లి, సూర్యనారాయణ స్వామి దేవస్థానం, సుమిత్రా కళాసమితి సంయుక్త నిర్వహణలో వైజయంతి ఉత్సవ మండపంలో ద్విశతావధాన కళావిలాస కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందులో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. సుమిత్రా కళా సమితి చక్కనైన సాహిత్య సేవ చేస్తోందని అన్నారు. తన తండ్రి సుసరాపు చిరంజీవి, నేతేటి గణేశ్వరరావుల పేర్లతో సభావేదిక ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు.

సభా సంచాలకులుగా విశాఖకు చెందిన డాక్టర్ పేరి రవికుమార్ వ్యవహరించగా, అప్రస్తుత ప్రసంగీకులుగా విజయవాడకు చెందిన పంతులు తపస్వి, దండిభొట్ల దత్తాత్రేయ శర్మ, అవధానికి పలు అప్రస్తుత సమస్యలను ఈ రోజు కూడా అడుగుతూ సమాధానాలు చెప్పమని కోరారు. ఉదయం 25 సమస్యలను స్వీకరించగా, మరో 25 సమస్యలను అవధాని అపర్ణ పూరణ చేశారు. అలాగే 25 దత్తపదులను కూడా పూరణ చేశారు. అలాగే 12 ఆశువులను వివరించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్, సమితి అధ్యక్షులు ఇప్పిలి శంకరశర్మ, డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, బంకుపల్లి రమేశ శర్మ, మండవిల్లి రవి, చిన్నారావు, నక్క శంకరరావు, కె.సురేష్, బంకుపల్లి శంకరం, పూజ తదితరులు పాల్గొన్నారు.

పైనాపిల్‌తో గిరిజన యువతకు ఉపాధి



కేవీకేలో పైనాపిల్‌తో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

ఆమదాలవలస: పైనాపిల్ విలువాధారిత ఉత్పత్తులతో గిరిజన యువతకు ఉపాధి కలుగుతుందని గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత అన్నారు. ఆమె శుక్రవారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ, మన్యం సహజ ఉత్పత్తిదారుల కంపెనీ నాబార్డ్ వారి సహకారంతో పైనాపిల్ విలువాధారిత ఉత్పత్తులపై గిరిజన యువతకు వృత్తి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యువతీ యువకులకు పైనాపిల్ స్క్వాష్, పైనాపిల్ జామ్ తయారుచేయడంపై శిక్షణ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పైనాపిల్ విలువాధారిత ఉత్పత్తుల శిక్షణ ద్వారా యువతి యువకులు తాము ఉపాధి పొందుతూ మరి కొంతమందికి ఉపాధి చూపించవచ్చునని తెలిపారు. పైనాపిల్ స్క్వాష్, జామ్‌ల తయారీతో స్వయం ఉపాధి పొందడమే కాకుండా ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, నాబార్డ్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ కె.రమేష్ కృష్ణ, ఆర్ట్స్ సీఈఓ ఎం.కృష్ణారావు, కేవీకే శాస్త్రవేత్తలు, గిరిజన యువతీ యువకులు తదితరులు పాల్గొన్నారు.

పీజీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని అఫిలియేషన్ కళాశాలల పోస్టు గ్రాడ్యుయేషన్ మొదటి సెమిస్టర్ ఫలితాలను ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ శుక్రవారం విడుదల చేశారు. 19 కోర్సుల ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్, జ్ఞానభూమి పోర్టల్‌లో విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. కోర్సుల వారీగా ఫలితాలు చూస్తే ఎకనామిక్స్‌లో 9 మందికి 8, ఇంగ్లిష్‌లో 17 మందికి 13, రూరల్ డెవలప్‌మెంట్‌లో నలుగురికి 4, సోషల్ వర్కులో ఒకరికి ఒకరు, తెలుగులో 8 మందికి ఎనిమిది మంది, ఎంబీఏలో 37 మందికి 36, ఎంకాంలో 9 మందికి 9, ఎంఈడీలో 17 మందికి 16, ఎంఎల్ఐఎస్సీలో 12 మందికి 9, కంప్యూటర్ సైన్స్‌లో 21 మందికి 18, అప్లైడ్ మేథ్స్‌లో 9 మందికి 7, జువాలజీలో 7 మందికి 7, ఎనలిటికల్ కెమిస్ట్రీలో 39 మందికి 25, బయోటెక్నాలజీలో 24 మందికి 24, ఫిజిక్స్‌లో 12 మందికి 10, ఆర్గానిక్ కెమిస్ట్రీలో 174 మందికి 80, గణితంలో 16 మందికి 12, మైక్రో బయోలజీలో 20 మందికి 19, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్‌లో 6 మందికి 6 ఉత్తీర్ణత సాధించారు. ఎంసీఏ నాలుగో సెమిస్టర్‌లో 37 మందికి 37 మంది ఉత్తీర్ణత సాధించారు. డిగ్రీ చివరి ఏడాది సెమిస్టర్ ఫలితాలు త్వరలో వెల్లడి కానున్నాయి. రీ వాల్యుయేషన్ కోసం 15 రోజుల్లోగా వర్సిటీ ఎగ్జామినేషన్స్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

బ్యాడ్మింటన్ టోర్నీకి సై

- నేడు, రేపు జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు
- ఇక్కడ రాణిస్తే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యే అవకాశం
- ఏర్పాట్లు పూర్తిచేసిన జిల్లా బ్యాడ్మింటన్ సంఘ పెద్దలు



బ్యాడ్మింటన్ సాధనలో క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీకి సర్వం సిద్ధమైంది. శని, ఆదివారాలు రెండు రోజులపాటు జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు శ్రీకాకుళంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న డీఎస్ఏ ఇండోర్ స్టేడియం వేదికగా జరగనున్నాయి. స్వర్గీయ నారాయణశెట్టి వెంకట శ్రీనివాసులు (వాసు) మెమోరియల్ జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్- 2024 పేరిట నిర్వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో మొత్తం ఆరు వయో విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. అండర్-11, అండర్-13, అండర్-15, అండర్-17, అండర్-19 బాలబాలికలకు, అలాగే స్త్రీ,పురుషులు(సీనియర్స్) వయో విభాగాల్లో పోటీలు జరుగుతాయి.

రాణిస్తే.. రాష్ట్రపోటీలకు

ఇక్కడ జరిగే జిల్లా బ్యాడ్మింటన్ టోర్నీలో రాణించి, విజేతలుగా నిలిచిన క్రీడాకారులను వివిధ జిల్లాల్లో జరిగే రాష్ట్ర పోటీలకు పంపించనున్నారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు వసతి, భోజన ఏర్పాట్లు కల్పించేలా జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. పోటీలకు సంబంధించి శుక్రవారం సాయంత్రం బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్, ప్రధాన కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్, చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, సీఈఓ సంపతిరావు సూరిబాబు, గురుగుబెల్లి ప్రసాద్, అనీల్ కుమార్, బి.దామోదర్, రత్నాజీ తదితరులు ఏర్పాట్లను సమీక్షించారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 300 మంది వరకు క్రీడాకారులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ పోటీల కోసం క్రీడాకారులు గత కొద్దిరోజులుగా కఠోర సాధన చేస్తున్నారు.

దాతల దాతృత్వం..

జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న ఈ ఎంపిక పోటీలకు పలువురు దాతలు చేయూతను అందిస్తున్నారు. క్రీడలపై ఆసక్తి కలిగిన సినీ నిర్మాత, వ్యాపారవేత్త నారాయణశెట్టి కిరణ్‌కుమార్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు టైటిల్ స్పాన్సర్‌షిప్‌ను అందిస్తున్నారు. అలాగే ఈ మెగా టోర్నమెంట్‌కు కో-స్పాన్సర్‌గా డాక్టర్ వెలమల వినోద్‌కుమార్ వ్యవహరిస్తుండగా, అలాగే టైటిల్/మెమొంటోలను మహేంద్ర వర్మ, సనపల సతీష్, కిరణ సతీష్ కుమార్ మిత్రబృందం అందిస్తున్నారు. జిల్లా నుంచి రాష్ట్ర పోటీలకు వెళ్లే క్రీడాకారులకు క్రీడా దుస్తులు, టీషర్ట్‌లను అందజేసేందుకు లక్ష్మీ సింహాద్రి కన్‌స్ట్రక్షన్ రియల్ ఎస్టేట్ ఎండీ గంజి భీమారావు ముందుకొచ్చి తన దాతృత్వాన్ని మరోసారి చాటుకున్నారు.

జాబ్‌మేళాలో 31 మంది ఎంపిక



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ

శ్రీకాకుళం న్యూకాలనీ: నిరుద్యోగ యువత అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని బలగ హాస్పిటల్ జంక్షన్‌లో ఉన్న డీఎల్‌టీసీ శిక్షణ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 31 మంది ఎంపికయ్యారు. ఉదయం జాబ్‌మేళాను ప్రారంభించిన అనంతరం ఆమె నిరుద్యోగులకు పలు సూచనలు చేశారు. అనేక అంశాలపై దిశానిర్దేశం చేశారు. మెడ్‌ప్లస్‌లో వివిధ ఉద్యోగాలు, ఇనోవ్ సోర్సెస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో వివిధ ఉద్యోగాల భర్తీ కోసం జిల్లా నలుమూలల నుంచి 170 మంది యువతీయువకులు హాజరుకాగా.. వివిధ మౌఖిక పరీక్షల అనంతరం 16 మంది ఆసక్తి కలిగిన అభ్యర్థులను ఆ సంస్థ ప్రతినిధులు ఎంపిక చేసినట్టు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ తెలిపారు. వీరికి నియామక పత్రాలను అందజేసినట్టు ఆమె తెలిపారు.

ప్రభుత్వ వైఖరిపై యూటీఎఫ్ ఆగ్రహం

శ్రీకాకుళం న్యూకాలనీ:

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉద్యోగ, ఉపాధ్యాయులను మరోసారి నిట్ట నిలువునా మోసం చేశారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడుతున్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని ఉద్యోగ ఉపాధ్యాయుల ఆకాంక్షగా ఉన్నమాట తెలిసిందే. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులకు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చింది. అయితే తాజాగా గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీపీఎస్‌నే అమలు చేస్తు రాజపత్రాన్ని విడుదల చేయడంపై సర్వత్రా విస్మయం చెందుతున్నారు. బాబును నమ్మి మోసపోయామని మండిపడుతున్నారు.

పాత తేదీతో రాజపత్రం విడుదల పచ్చి మోసం..

2023 అక్టోబర్ నుంచి సీపీఎస్ ఉద్యోగులందరినీ జీపీఎస్‌లోకి తెస్తూ కూటమి ప్రభుత్వం పాత తేదీతో రాజపత్రాన్ని ఇప్పుడు విడుదల చేయటం ఉద్యోగ ఉపాధ్యాయులను మోసపుచ్చడమేనని యూటీఎఫ్ ప్రతినిధులు దుయ్యబట్టారు. బ్యాక్ డేట్‌తో జీపీఎస్ అమలు చేస్తూ ప్రభుత్వం రాజపత్రాన్ని విడుదల చేయటం దుర్మార్గమని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడుతున్నాయి. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్ శుక్రవారం రాత్రి విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండించారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ రాజపత్రాన్ని వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తక్షణం పాత పెన్షన్‌ని పునరుద్ధరించడానికి కోసం వెంటనే కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు జిల్లా కేంద్రంలో నిరసన..

2017లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ని తక్షణం అమలు చేసి, 2003 డీఎస్సీ ద్వారా నియామకమైన ఉపాధ్యాయులందరినీ తిరిగి పాత పెన్షన్‌లోకి పునరుద్ధరించడానికి కూటమి ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వెంటనే పాతపెన్షన్ విధానాన్ని అమలుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపడతామని ఆయన తెలియజేశారు.

వరద నీటి కల్వర్టు ధ్వంసం

వజ్రపుకొత్తూరు:

మండలంలోని పాతటెక్కలి ఎస్సీ, బీసీ కాలనీకి వెళ్లే రహదారిపై ఉన్న వరద నీటి కల్వర్టు ధ్వంసమైంది. దీంతో కాలనీ వాసులు శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. కల్వర్టు పక్కనే ఉన్న వంశధార స్థలాల ఆక్రమణదారులు కొంత మంది కల్వర్టును జేసీబీ యంత్రంతో కూలదోశారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

దీని వల్ల కాలనీ వరద నీరు బయటకు పోయేందుకు అవకాశం లేకుండా పోయిందని చెబుతున్నారు. కల్వర్టుపై ఉన్న దిబ్బను తొలగించి వరద నీరు వెళ్లకుండా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ధ్వంసం చేసిన వరద నీటి కల్వర్టు

అయ్యప్పనగర్‌లో చోరీ యత్నం

టెక్కలి రూరల్: స్థానిక అయ్యప్పనగర్‌లో గురువారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. అర్ధరాత్రి సమయంలో అయ్యప్పనగర్‌లో కొంత మంది ఇళ్లలో ప్రవేశించి చోరీకి పాల్పడుతుండగా గుర్తించిన స్థానికులు కేకలు వెయ్యడంతో ఆ వ్యక్తులు అక్కడి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశారు. దాంతో స్థానికులు ఆ వ్యక్తులపై రాళ్లతో దాడి చెయ్యడంతో వారు సమీప జాతీయ రహదారిపైకి వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఈ చోరీ ప్రయత్నం జరిగిన ప్రాంతంలోనే టెక్కలి రూరల్ సీఐ సూర్యచంద్రమౌళి నివాసముంటున్నారు.

బైక్‌లు చోరీ చేస్తున్న ఇద్దరు అరెస్ట్



మాట్లాడుతున్న ఆమదాలవలస సీఐ దివాకర్ వాయునందన్ యాదవ్

ఆమదాలవలస: జిల్లాలోని పలు ప్రాంతాల్లో బైక్‌లు దొంగిలిస్తున్న ఇద్దరిని ఆమదాలవలస ఫ్లై ఓవర్ సమీపంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద పట్టుకుని అరెస్టు చేసినట్లు ఆమదాలవలస సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. దివాకర్ వాయునందన్ యాదవ్ తెలిపారు. నిందితులను పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఆమదాలవలస పోలీస్ స్టేషన్ పరిధిలో జొన్నవలస, మెట్టక్కివలస ప్రాంతాలలో రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురైనట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. వీటిపై ఎస్పీ జీఆర్ రాధిక సకాలంలో స్పందించి కేసులు పరిష్కరించాలని ఆదేశించడంతో ఎస్ఐ వెంకటేష్‌తో పాటు మరో నలుగురు పోలీసు సిబ్బందితో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శుక్రవారం పట్టణ శివారున ఉన్న వైఎస్ఆర్ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా శ్రీకాకుళం పట్టణానికి చెందిన బొమ్మలాట మోహన్, తోట శ్రీనివాసరావు అనే ఇద్దరు వ్యక్తులు చోరీకి గురైన ద్విచక్ర వాహనాలపై రావడం గుర్తించి పట్టుకున్నామని పేర్కొన్నారు. వీరిద్దరినీ విచారించగా జొన్నవలస, మెట్టక్కివలస, ఎచ్చెర్లకు సంబంధించిన మూడు ద్విచక్రవాహనాలతో పాటు మరో మూడు ద్విచక్ర వాహనాలు లభించాయని తెలిపారు. అలాగే జిల్లాలోని శ్రీకాకుళం లావేరు నరసన్నపేట పోలీస్ స్టేషన్లలో కూడా వీరిద్దరిపై పలు కేసులు నమోదైనట్లు సీఐ తెలిపారు. ద్విచక్ర వాహనాల కేసును త్వరగా ఛేదించిన ఎస్ఐ వెంకటేష్ తో పాటు కానిస్టేబుల్ నాయుడు, శ్యామ్, బాలును సీఐ యాదవ్ అభినందించి రివార్డులను అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

జలుమూరు: లింగాలవలస వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలాకి మండలం మబగాం గ్రామానికి చెందిన కొర్ను సూర్యనారాయణకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సూర్యనారాయణ ఎల్ఎన్‌పేట మండలం కృష్ణాపురంలోని తన బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా నరసన్నపేట నుంచి పాతపట్నం వెళ్తున్న వ్యాన్ ఢీకొట్టింది. దీంతో ఆయన కుడికాలు విరిగింది. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది వచ్చి క్షతగాత్రుడిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.